క్లుప్తంగా

సినీనటుడు పద్మనాభంకు నివాళి



విజయవాడ కల్చరల్: బహుముఖ ప్రతిభాశాలి సినీనటుడు పద్మనాభం అని మహానటి సావిత్రి సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి అన్నారు. సాహితీ సంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని సంస్థకార్యాలయంలో సినీ నటుడు,నిర్మాత ,దర్శకుడు పద్మనాభం 95వ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ పద్మనాభం నిర్మాత, దర్శకునిగా ప్రతిభచాటుకున్నారన్నారు. విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్‌రాజు, వివిధ సంస్థల ప్రతినిధులు బీవీ వీరభద్రరావు, ప్రభల శ్రీనివాస్, రాయరాజు, డి.చంద్రశేఖర్, కె.రాజు పాల్గొన్నారు.

విద్యార్థినికి సైకిల్ బహూకరణ



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సమాజంలో పేదరికాన్ని అంతమొందించే ఏకైక సాధనం చదువు ఒక్కటేనని.. నిరుపేద విద్యార్థులకు చేయూతనివ్వాల్సిన బాధ్యత సమాజంలో ప్రతిఒక్కరిపై ఉందని కళ్ళే లలితా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు కళ్ళే నాగేశ్వరరావు పేర్కొన్నారు. సింగ్‌నగర్ ప్రాంతానికి చెందిన పేద విద్యార్థిని పాఠశాలకు వెళ్లివచ్చేందుకు ఇబ్బందిపడుతుంటంతో ఆ విద్యార్థినికి కళ్ళే లలితా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు బుధవారం సైకిల్‌ను బహుకరించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పేద విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు తమవంతు సహకారం అందించేందుకు తాము ఎళ్లవేళలా ముందుంటామని వివరించారు. ట్రస్ట్ డైరక్టర్లు కళ్ళే సీతామహాలక్ష్మి, జయదుర్గా, మేఘవాణి, ముప్పూరి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు



పాయకాపురం(విజయవాడరూరల్): శ్రీకృష్ణుని ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని వైసీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆకాంక్షించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా బుధవారం నాగ వంశం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో ఆయన పాల్గొన్నారు. శ్రీకృష్ణుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీతాసారాన్ని ప్రతిఒక్కరూ మనస్సులో నింపుకొని ధ్యానిస్తే జీవితం సుఖమయమవుతుందని పేర్కొన్నా రు. వేడుకల్లో భాగంగా నృత్యం చేసిన చిన్నారులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో డివిజన్ వైసీపీ కన్వీనర్ పసుపులేటి యేసు, కాళ్ళ సత్యం, తిరుపతిరావు, సురేష్, దుర్గారావు, కె.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

24న శ్రమైక జీవనం చిత్ర ప్రదర్శన



కృష్ణలంక(విజయవాడతూర్పు): గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 24వ తేదీన శ్రమైక జీవనం చిత్ర ప్రదర్శన, వర్తమాన పరిస్థితులలో చిత్రకారుని పాత్ర అనే అంశంపై సెమినార్ నిర్వహిస్తున్నామని ఎం.బి.విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పి.మురళీకృష్ణ పేర్కొన్నారు. బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో సెమినార్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ఎం.బి.విజ్ఞాన కేంద్రం, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, కళాయజ్ఞ సంయుక్త ఆధ్వర్యంలో చిత్రకారుల రాష్ట్ర స్థాయి సెమినార్ జరుగుతుందన్నారు. 24న ఉదయం 10 గంటలకు రాష్ట్రంలోని ప్రముఖ చిత్రకారులు 48 మంది శ్రమైక జీవనంపై వేసిన చిత్రాలతో కూడిన ఎగ్జిబిషన్‌ను చిత్రకళావధాన్ మార్లపూడి ఉదయ్‌కుమార్ ప్రారంభిస్తారని చెప్పారు. ఉదయం 11 గంటలకు వర్తమాన పరిస్థితులలో చిత్రకారుని పాత్ర అనే అంశంపై సదస్సు ప్రారంభమవుతుందన్నారు. సదస్సులో ప్రఖ్యాత కార్టూనిస్ట్ శ్రీధర్, యోగి వేమన విశ్వ విద్యాలయం ఫైన్ ఆర్ట్స్ డిపార్ట్‌మెంట్ డాక్టర్ మృత్యుంజయరావు, సంప్రదాయ చిత్రకళ అధ్యాపకుడు డాక్టర్ సాగర్ గిన్నె, ప్రముఖ చిత్రకారుడు వై.శేషబ్రహ్మం, తెలుగు బాషోద్యమ సంస్థ నాయకుడు ప్రొఫెసర్ గారపాటి ఉమామహేశ్వరావు పాల్గొంటారని తెలిపారు. చిత్రకారులు, చిత్ర కళాభిమానులు పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకోవాలని కోరారు. సమావేశంలో అరసవిల్లి గిరిధర్, ఎ. సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కండ్రిక జంక్షన్‌లో ట్రాఫిక్ వెతలు

- నిత్యం భారీ వాహనాల రాకపోకలు..
- సింగిల్ కల్వర్టుతో సమస్య జఠిలం
- ఇబ్బందుల్లో వాహనచోదకులు



కండ్రిక జంక్షన్‌లో ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు పనిచేయకపోవడంతో ఇష్టారీతిన వెళ్తున్న వాహనదారులు

పాయకాపురం(విజయవాడరూరల్): నగర శివారు కండ్రిక జంక్షన్లో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు జఠిలమవుతుండటంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇన్నర్‌రింగ్ రోడ్డు, రామవరప్పాడు ఫ్లైఓవర్ నుంచి జాతీయ రహదారిపై ఏలూరు, రాజమహేంద్రవరం, విశాఖపట్నం, కలకత్తా తదితర దూర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు, అదే రహదారిలో హైదరాబాదు, ముంబాయి, పుణే వెళ్లే వాహనాలు కండ్రిక జంక్షన్ మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. అంతేకాక కండ్రిక కాలనీ ఆపై ప్రాంతాలకు వెళ్లే వాహనాలు కండ్రిక జంక్షన్‌లో 30ఏళ్ల కిందట నిర్మించిన చిన్నపాటి కల్వర్టు మీదుగానే రాకపోకలు సాగించక తప్పడం లేదు.

ప్రమాదాలకు నెలవుగా జంక్షన్..

కండ్రికలో టీసీఎస్ సంస్థకు చెందిన ఎగ్జామినేషన్ సెంటర్ ఉండటంతో నిత్యం ఇక్కడ వాహనాల రద్దీ ఉంటుంది. దీంతో ట్రాఫిక్ సమస్య కూడా పెరిగింది. ఇన్నర్ రింగ్ రోడ్డు నుంచి వచ్చే వాహనాలు, నూజివీడు సైడు నుంచి వచ్చే ఆర్టీసి బస్సులు, లారీలు ఒకే సమయంలో వచ్చిన సమయంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇక ఇదే జంక్షన్లోనే బార్ అండ్ రెస్టారెంట్ ఉండటంతో పలువురు మద్యం సేవించిన వారు ఇక్కడ ప్రమాదాల బారినపడుతుండటం గమనార్హం.

పనిచేయని ట్రాఫిక్ లైట్లు..

ఈనెల 4వ తేదీన రాధానగర్‌కు చెందిన తాపీమేస్త్రీ మద్యం సేవించి కల్వర్టు గోడపై కూర్చొని పక్కనే ఉన్న పంపింగ్ స్టేషన్ మురుగు నీటిలో పడి మృతిచెందారు. ఈ జంక్షన్‌లో చోటుచేసుకున్న పలు ప్రమాదాల్లో పశువులు కూడా మృతిచెందాయి. ట్రాఫిక్ సమస్య దృష్ట్యా ఏర్పాటు చేసిన సిగ్నల్స్ కొంత కాలంగా పనిచేయడం లేదు. ట్రాఫిక్ పోలీసులు అప్పుడప్పుడు వాహనాలు తనిఖీ పేరుతో హెల్మెట్ లేదని, రికార్డులు లేవని అపరాధ రుసుము వసూలు చేస్తున్నారనే తప్ప ప్రమాదాలు చోటుచేసుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాత్రం దృష్టి పెట్టకపోవడం శోచనీయమని వాహనచోదకులు విమర్శిస్తున్నారు.

ఆక్రమణల్లో రోడ్డు..

అంతేకాక రోడ్డుపై రోజురోజుకు పెరుగుతున్న ఆక్రమణలను వీఎంసి అధికారులు పట్టించుకోకపోతుండటం కూడా ట్రాఫిక్ సమస్య పెరగడానికి మరో కారణం. అధికారపార్టీ నాయకుల్లో కొందరు బడ్డీకొట్లు పెట్టించి మామూళ్లు దండుకుంటుండటం కూడా ఈ రోడ్డు ఆక్రమణలకు ప్రధాన కారణం. ఈ ఆక్రమణలను తొలగించే విషయంలో వీఎంసీ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అదేవిధంగా కొండపల్లి ఆయిల్ కంపెనీల నుంచి వచ్చే ఆయిల్ ట్యాంకర్లు కూడా ఈమార్గం నుంచి రాకపోకలు సాగిస్తుంటాయి. ట్రక్‌లు, క్వారీ లారీల రాకపోకలు కూడా అధికంగా ఉంటుండటంతో ఎప్పుడు ఏప్రమాదం చోటుచేసుకుంటుందోనని వాహనచోదకులు, స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. ఇకనైనా వీఎంసీ అధికారులు ఈ రోడ్డులో ఆక్రమణలను తొలగించడంతో పాటు కండ్రిక జంక్షన్‌లోని కల్వర్టును నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రతిపాదనల్లోనే కల్వర్టు నిర్మాణం..



విస్తరణకు నోచుకోని కల్వర్టు

ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణంగా చెబుతున్న కండ్రిక వైపు ఉన్న సింగిల్ కల్వర్టును రోడ్డుకు ఇరువైపులా విస్తరించి మరో కల్వర్టును నిర్మించాలని స్థానిక కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ ఏడాది కిందట వీఎంసి సమావేశంలో ప్రతిపాదన చేశారు. అప్పట్లో రూ.40లక్షల వ్యయంతో మసీదు రోడ్డును విస్తరించి కల్వర్టు నిర్మించేలా ఇంజినీరింగ్ అధికారులు అంచనాలు తయారు చేశారు. అయితే ఇప్పటివరకు పనులు చేపట్టకపోవడంతో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి నోచుకోక రోజురోజుకు మరింత జఠిలమవుతోంది.

పనులు చేపట్టాలి...



కండ్రిక జంక్షన్‌లో కల్వర్ట్ నిర్మాణం, పంపింగ్ స్టేషన్ వద్ద డ్రెయిన్ నిర్మాణాలకు సంబంధించిన పనులను నగర పాలక సంస్థ అధికారులు వెంటనే చేపట్టాలి. తీర్మానం చేసిన పనులను చేపట్టే విషయంలో జాప్యం చేయడం తగదు.

– యర్రగొర్ల తిరుపతమ్మ, 64వ డివిజన్ కార్పొరేటర్

త్వరలో పనులు చేపడతాం...

కండ్రిక జంక్షన్‌లో వీఎంసి జనరల్ ఫండ్స్ నిధులు రూ.3కోట్లతో మూడు కల్వర్టుల నిర్మాణంతోపాటు పంపింగ్ స్టేషన్ వద్ద డ్రైన్ నిర్మాణం చేపడతాం. త్వరలోనే ఈ పనులు ప్రారంభిస్తాం.

– బి.మాధవ్, వీఎంసీ ఏఈ

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి



విద్యార్థిని హెన్నాను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, అధ్యాపకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు విద్యకే పరిమితం కాకుండా అన్ని రంగాలలో రాణించాలని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి సూచించారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్‌సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో బుధవారం బీఆర్టీఎస్ రోడ్డులో ఏపీశాక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 5కె మారథాన్ రన్‌లో ద్వితీయస్థానం సాధించిన కళాశాల విద్యార్థిని వి.హెన్నా అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారథాన్ జిల్లాస్థాయి పోటీల్లో హెన్నా ద్వితీయస్థానంలో నిలవడంతోపాటు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికకావడం విద్యార్థులందరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యాయా మవిద్య విభాగాధిపతి యుగంధర్, అధ్యాపకులు ఎం.పద్మనాభం తదితరులు హెన్నాను అభినందించారు.

బుడమేరుపై స్పష్టమైన సమాచారం ఇవ్వాలి

మాజీ ఎమ్మెల్యే విష్ణు డిమాండ్

మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరుకు సంబంధించి రాష్ట్రప్రభుత్వం ఏమిచేస్తుందో ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త మల్లాది విష్ణు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బుడమేరుపై అధికార యంత్రాంగం ప్రజలకు స్పష్టమైన సమాచారం ఇవ్వాలని కోరారు. అజిత్ సింగ్ నగర్, పాయకాపురం, కండ్రిక ప్రాంతాల్లో ఉన్న 10డివిజన్లతోపాటు గతేడాది వరద ముంపునకు గురైన ప్రాంతాల ప్రజలు మళ్లీ ఈసారి ముంపునకు గురికాకుండా ప్రభుత్వం జవాబుదారీతనంతో వ్యవహరించాలన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండేలా వాతావరణం, బుడమేరు వరద అంశంపై రోజుకు రెండుసార్లు స్పెషల్ బులిటెన్‌లు విడుదల చేయాలన్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయకపోవడంతో బుడమేరు ముంపు బారిన పడే ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారన్నారు. భారీవర్షాలు, వరదల నేపథ్యంలో ఈనెల 13వ తేదీ నుంచి ఇప్పటి వరకు అజిత్‌సింగ్‌నగర్ తదితర ప్రాంత వాసులకు కంటినిండా నిద్ర కూడా కరువైందన్నారు. అధికార యంత్రాంగం డబాకొట్ల వద్ద మంగళవారం పడవులు తెచ్చిపెట్టడంతో నగరంలో గందరగోళం ఏర్పడిందన్నారు.ముందస్తు చర్యల కోసమంటూ అధికారులు, గుర్రపు డెక్క తొలగింపు కోసమంటూ ఎమ్మెల్యే పరస్పర విరుద్ధమైన వ్యాఖ్యలు చేయడంతో ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయని పేర్కొన్నారు.

నూజివీడు-విజయవాడ రోడ్డుల్లో పొలాల నుంచి వర్షపునీరు రోడ్లపై చేరుతుండగా, అధికారయంత్రాంగం ఏమి చర్యలు తీసుకుందో చెప్పాలన్నారు. మున్సిపల్‌శాఖా మంత్రి నారాయణ 15లక్షలకుపైగా జనాభా ఉన్న విజయవాడ ప్రజలను గాలికొదిలేసి, జనసామర్థ్యం తక్కువ ఉన్న అమరావతిని పరిరక్షించే పనిలో పడ్డారని ఎద్దేవా చేశారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ప్రజలకు ఎప్పటికప్పుడు స్పష్టమైన సమాచారం అందించాలని మాజీ ఎమ్మెల్యే విష్ణు డిమాండ్ చేశారు.

గుర్తింపు కార్డు ఉంటేనే వ్యాపారానికి అనుమతి

వీధి వ్యాపారులకు వెండింగ్ సర్టిఫికెట్లు

పటమట(విజయవాడతూర్పు): గుర్తింపు కార్డు ఉంటేనే వీధిలో వ్యాపారం చేసుకునేందుకు అనుమతి ఉంటుందని, వీధి విక్రయదారులకు గుర్తింపు కార్డులు, వెండింగ్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నట్లు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వీధి విక్రయదారుల చట్టం 2014 ప్రకారం నగరంలో వివిధ రకాల వీధి వ్యాపారాలు చేస్తున్న వ్యాపారస్తులందరూ గుర్తింపు కార్డు, వెండింగ్ సర్టిఫికెట్లను పొందాలన్నారు. అందుకు మెప్మా రిసోర్స్ పర్సన్స్, వార్డు సంక్షేమ అభివృద్ధి కార్యదర్శుల ద్వారా సర్వేలో పాల్గొనాలన్నారు. అనంతరం రూ.200 చెల్లించాలని అన్నారు. ఈ మొత్తాన్ని కమిషనర్ వీఎంసీ టౌన్ వెండింగ్ కమిటీ పేరుతో ఉన్న ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ విజయవాడ బ్రాంచ్ ఖాతా నంబర్ 010101000025000, ఐఎఫ్ఎస్సీ కోడ్ ఐవోబీఏ0000101 నకు జమచేసి చెల్లించి తగు రసీదు /చలానా /కౌంటర్ ఫాయిల్, యూపీఏ ద్వారా పేమెంట్ చేసేవారు ఫోన్ స్క్రీన్ షాట్ ప్రింట్ కాపీలను వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని యూసీడీ విభాగంలో సమర్పించాలన్నారు. గుర్తింపు కార్డులు పంపిణీ జరిగిన తర్వాత నగరంలోని ఆయా ప్రాంతాల్లో ఉన్న వీధుల్లో వ్యాపారం చేయగలరని, లేకపోతే వీధివ్యాపారం చేసుకునేందుకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు.

23, 24 తేదీల్లో లైఫ్ సైన్సెస్‌పై సెమినార్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు, విద్యార్థులు

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): స్థానిక పీబీ సిద్ధార్థ కళాశాల ఆవరణలోని వెబ్‌నార్ హాలులో లైఫ్ సైన్సెస్ ఇన్ ట్రెయిల్‌బ్లేజింగ్ పాత్ వేస్(థింక్ ఏహెడ్) అంశంపై ఈ నేల 23, 24 తేదీల్లో జాతీయ స్థాయి సదస్సును నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ చెప్పారు. కళాశాల ఆవరణలోని సెమినార్ హాలులో సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ మానవ వ్యాధులు నివారణ, రోగ నిర్ధారణ-చికిత్స అంశాలతో పాటుగా ప్రత్యేకమైన జన్యు అలంకరణ, పర్యావరణానికి అనుగుణంగా చికిత్సలు, జన్యు చికిత్స, కణ చికిత్సలు, వ్యాక్సిన్‌ల గురించి ఈ సదస్సులో చర్చిస్తామన్నారు. సదస్సులో హైదరాబాద్‌లోని బయోఫౌలింగ్ అండ్ బయోఫిల్మ్ ప్రాసెస్ సెక్షన్(బీబీపీఎస్) సైంటిఫిక్ ఆఫీసర్ డాక్టర్ వై.నాంచారయ్య, సైంటిస్ట్ డాక్టర్ బి.కిరణ్‌కుమార్, ప్రొఫెసర్ నరేష్ సేపురి, ప్రొఫెసర్ డాక్టర్ కె.నాగమోహన్ రిసోర్స్ పర్సన్‌గా హాజరవుతారని తెలిపారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్ సి.జంపాల, వైస్ ప్రిన్సిపాల్ మనోరంజనితో పాటుగా అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో అనేక అనర్థాలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆంజనేయులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మత్తుపదార్థాల కారణంగా జీవితాలు అంధకారమవుతాయని, విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని నవజీవన్ బాలభవన్ మనోస్ యూనిడాస్ ప్రోగ్రామ్ మేనేజర్ ఆంజనేయులు సూచించారు. వాంబేకాలనీలోని డాక్టర్ జంధ్యాల దక్షిణామూర్తి హైస్కూల్‌లో బుధవారం ప్రత్యేక మానసిక ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సినిమాలు, సోషల్ మీడియాలో వస్తున్న వీడియోలు చూసి కొంతమంది చిన్నారులు, యువత మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన తీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల కారణంగా జరిగే నష్టాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. మత్తు పదార్థాల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు సూచించారు. నవజీవన్ బాలభవన్ టీచర్లు హసీనా, శిరీష తదితరులు పాల్గొన్నారు.

స్వీయరక్షణపై అవగాహన



పటమట(విజయవాడతూర్పు): బాలికలు, మహిళల చట్టాలపై అందరూ అవగాహన ఉండాలని, శక్తి యాప్ ద్వారా ఆపద సమయాల్లో రక్షణ పొందవచ్చని శక్తి బృందం సభ్యులు అన్నారు. బుధవారం నగరంలోని వివిధ కళాశాలలు, విద్యాసంస్థల్లో మహిళ చట్టాలు, స్వీయ రక్షణ బాలికలకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అదే విధంగా అనుమానిత ప్రదేశాలపై నిఘా పటిష్టం చేయడంతోపాటు విరివిగా ఆయా ప్రదేశాలను తనిఖీ చేయడం, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిని అదుపులోకి తీసుకోవడంతో వారికి మత్తు పదార్థాలను సేవించడం వల్ల కలిగే అనార్థాల గురించి అవగాహన కల్పిస్తామని బృంద సభ్యులు తెలిపారు.

తెలుగు వారి ఆత్మ హరికథ



మాట్లాడుతున్న మోదుమూడి సుధాకర్

విజయవాడ కల్చరల్: హరికథా సంప్రదాయం తెలుగు వారి ఆత్మ అని సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ అన్నారు. సత్యనారాయణపురంలోని సీతారామా కల్యాణ మండపంలో హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు 161 జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం నేతి లక్ష్మీనారాయణ సంస్మరణసభను నిర్వహించారు. ఈసందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ నేతి లక్ష్మీనారాయణ భాగవతార్ సంగీత సాహిత్యాలను మేళవించి కథను రసరమ్యంగా వినిపించేవారన్నారు. తెలుగు వారు హరికథా ప్రియులని, ఎందరో హరికథా భాగవతార్‌లు హరికథా సంస్కృతిని కాపాడుతున్నట్లు తెలిపారు. సంగీత విద్వాంసురాలు బీవీ దుర్గాభవాని, అన్నమయ్య పరివార్ అధ్యక్షుడు వైవీ కృష్ణయ్య మాట్లాడుతూ నేతి లక్ష్మీనారాయణ జీవిత విశేషాలను వివరించారు. ఎస్‌వీ శ్రీరామ్ భట్టార్‌ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఆదిభట్ల నారాయణదాసు శిష్య ప్రశిష్యబృందం, అన్నమయ్య పరివారం, ప్లాంజేరీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పీ రవి ప్రసాద్‌రాజు భూకైలాస్, జంధ్యాల కృష్ణకుమారి అన్నమయ్య చరిత్ర, యస్‌వీ రామభట్టార్ భక్తకుచేల, ధూళిపాల శివరామకృష్ణ శర్మ రుక్మిణీ కల్యాణం కథను గానం చేశారు.

వైభవంగా నందీశ్వరునికి రుద్రాభిషేకం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని పురాతన ఆలయమైన పాత శివాలయంలో నందీశ్వరునికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. నగరంలోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లో త్రయోదశిని పురస్కరించుకొని ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతి మాసంలోనూ త్రయోదశి రోజున నందీశ్వరునికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించటం ఆనవాయితీ. అందులో భాగంగా బుధవారం సాయంత్రం ప్రదోషకాలంలో నందీశ్వరస్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. విశేష పుష్పాలంకరణ, పంచహారతులు తదతర కార్యక్రమాలను జరిపించారు. అలాగే స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు.

దుర్గగుడిలో అంతర్గత బదిలీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో చేపట్టిన అంతర్గత బదిలీలు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. దసరా ఉత్సవాలకు మరో నెల రోజులు ఉండగా, ఆలయంలోని కీలక విభాగాల్లో సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్‌లతో పాటు 31 మందికి అంతర్గత బదిలీలు చేస్తూ ఈవో శీనానాయక్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. అయితే ఈ దఫా నిర్వహించిన ఉద్యోగుల బదిలీలలో దేవస్థానానికి సంబంధించిన దత్తత సంస్థకు బదిలీపై వచ్చిన ఓ అధికారి కీలక పాత్ర పోషించినట్లు దేవస్థానంలో ప్రచారం జరుగుతోంది. సూపరింటెండెంట్లలో పి. భాగ్యజ్యోతి ప్రసాదాల తయారీ నుంచి అన్నదానానికి, వి. సూర్యనారాయణమూర్తి వేద పాఠశాల, దత్తత దేవాలయాలు, సత్రాలు, ప్రొటోకాల్ విధులు నిర్వహిస్తుండగా, ఆ విధుల నుంచి తప్పించారు. కె. శ్రీనివాసరావుకు ప్రొటోకాల్, డోనర్ సెల్, కొండపై కొంటర్లు, డీసీఆర్ స్టాక్‌రిజిస్టర్ పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. సీహెచ్ నరసింహరావుకు ల్యాండ్స్, లీజెస్, లీగల్ విభాగాలతో పాటు ఈవో పేషీ సూపరింటెండెంట్ బాధ్యతలు అదనంగా అప్పగించారు. కొర్లె శ్రీనివాసరావుకు ప్రసాదం తయారీ, కొండ దిగువన ప్రసాదాల కౌంటర్ల నిర్వహణ బాధ్యతలు, ఎల్. శ్రీనివాసరావుకు కేశ ఖండనశాల, శానిటేషన్, దుర్గాఘాట్ నిర్వహణ, హారతుల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. ఐటీ, జీఎస్టీ, రిటన్స్, టోల్ ఫ్రీ కౌంటర్ల నిర్వహణ బాధ్యతలు నిర్వర్తిస్తున్న పి.సునీతకు అదనంగా ధర్మపథం, దాతల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకునే బాధ్యతలు అప్పగించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేట సెక్షన్, మ్యూజియం సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ బీసెంట్ రోడ్డు ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం ఏడు గంటల నుంచి పదిగంటల వరకు విద్యుత్‌సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని కస్పావారి వీధి, హెల్ప్ హాస్పిటల్ రోడ్డు, మద్దులపల్లి వారి వీధి, పాలపర్తి వారి వీధి, బీసెంట్ రోడ్డు, దున్నా వారి వీధి, గోపాలరెడ్డి రోడ్డు ,పెద్దిబొట్ల వారి వీధి, కాంగ్రెస్ ఆఫీసు రోడ్డు(నవరంగ్ ఏరియా) తదితర ప్రాంతాల్లో విద్య్‌యత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వివరించారు. వినియోగదారులు గమనించాలని ఈఈ కోరారు.

ముత్యాలంపాడు సెక్షన్ పరిధిలో..

మధురానగర్(విజయవాడసెంట్రల్):ముత్యాలంపాడు సెక్షన్ 11 కె.వి.రామలింగేశ్వరపేట, అయోధ్యనగర్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా గురువారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.రవీంద్రబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామలింగేశ్వరపేట మెయిన్ రోడ్డు, అయోధ్య టవర్స్, రామలింగేశ్వర జీరో లైన్ నుంచి ఆరో లైన్ వరకు, లోటస్ సెక్టార్ 4 ఏరియాలో హెచ్‌ఆర్‌టీ 5బీ బ్లాక్ నుంచి 10వ బ్లాక్ వరకు, లోటస్ సెక్టార్ 5, పింగళివారి వీధి , సీకే రెడ్డి రోడ్డు, ఆనంద్ హైట్స్, అయోధ్యనగర్ జీరో లైన్ నుండి 7 లైన్ వరకు తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వివరించారు. వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

అయ్యప్పకు విశేష పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం అయ్యప్పస్వామి మందిరంలో శ్రీమణికంఠ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పూజలు అర్చనలు నిర్వహించారు. స్వామివారికి పంచామృత అభిషేకాలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను గురుస్వామి బల్లెం పూర్ణయ్య పర్యవేక్షించారు.

మద్యం మత్తులో డ్రైవింగ్.. ఆరుగురికి జైలు శిక్ష

లబ్బీపేట(విజయవాడతూర్పు): మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఆరుగురికి జైలు శిక్ష, 43 మందికి జరిమానా విధిస్తూ 7వ అడిషనల్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు తీర్పు చెప్పింది. నగరంలోని 3వ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 49 మందిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. అనంతరం వారిని కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి ఆర్‌పీఎస్ శర్మ ఆరుగురికి 7 రోజుల జైలుశిక్షణ, 43 మందికి ఒక్కొక్కరికీ రూ.10 వేలు జరిమానా విధించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

పాయకాపురం(విజయవాడరూరల్): గడ్డిమందు తాగి ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతున్న ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు దేవినేని గాంధీపురంనకు చెందిన బిర్రు శివ భవానీపురంలోని ఓ ద్విచక్రవాహన షోరుమ్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. మొబైల్ యాప్‌లు, తెలిసినవారి వద్ద అప్పులు చేశాడు. ఆ అప్పులు తిరిగి చెల్లించాలంటూ సదరు వ్యక్తులు ఇబ్బందిపెట్టారంటూ శివ ఈనెల 19వ తేదీన గడ్డిమందు తాగడంతో కుటుంబసభ్యులు అతన్ని ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఈక్రమంలో చికిత్స పొందుతున్న శివ బుధవారం మృతిచెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దోమల వ్యాప్తిని అరికట్టండి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



పటమట(విజయవాడతూర్పు): ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఉదయం నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, జక్కంపూడి కమ్యూనిటీ హాల్ వద్ద డెంగీ, మలేరియా నివారణ అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఇంటి లోపల, పరిసరాల్లో నీటి నిల్వలు ఉన్న ప్రాంతాల్లో లార్వా గుర్తింపు నిర్వహించి, వ్యాధుల సంక్రమణపై అవగాహన కల్పించారు. మలేరియా, డెంగీ వ్యా దులకు కారకాలైన దోమల నిర్మూలనపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించే కరపత్రాలు ఇంటింటికీ పంపిణీ చేశారు.

నీరు నిల్వ ఉండకూడదు..

ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడుతూ మలేరియా, డెంగీ వ్యాప్తికి కారకాలైన దోమల ప్రబలకుండా వాటి వ్యాప్తిని అరికట్టాలని కమిషనర్ కోరారు. . ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలని, కూలర్లు, ఫ్లవర్ వాజులు, పూల కుండీల్లో నీటిని తరచూ మార్చాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం. సుహాసిని, నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, ఇన్‌చార్జి జోనల్ కమిషనర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె. శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, బయాలజిస్ట్ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.